క్లుప్తంగా

జగనన్న రుణం తీర్చుకుందాం


మాట్లాడుతున్న రావూరి ఈశ్వర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: బడుగు, బలహీనవర్గాలు ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్న రుణం తీర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన ప్రచార ముగింపు సభ విజయవంతం కావడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎండలో ప్రజలు అంతసేపు వేచి ఉన్నారంటే వైఎస్సార్‌సీపీ మీద ఉన్న అభిమానంతోనేనని చెప్పారు. అదే చంద్రబాబు సభకు పెద్దగా జనం రాకపోవడంతో ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతాయో ప్రజలకు అర్థమైందన్నారు. జగనన్న అధికారంలో వచ్చాక చిత్తూరు నియోజకవర్గానికి దాదాపు రూ.1750 కోట్లు ఖర్చు చేశారన్నారు. కోవిడ్ సంక్షోభం వచ్చాక కూడ సంక్షేమం ఎక్కడ ఆగలేదని గుర్తుచేశారు. బీసీలపై చంద్రబాబుది కపట ప్రేమ అని విమర్శించారు. ఎన్నికల ముందు బలహీనవర్గాలనుపై ప్రేమ చూపడం ఆపై మోసం చెయ్యడం ఆ పార్టీకు అలవాటే అని దుయ్యబట్టారు. ప్రజలందరూ ఫ్యాను గుర్తుకు ఓటేసి, జగనన్న సుపరిపాలనను మళ్లీ తెచ్చుకోవాలని కోరారు.

చిత్తూరులో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం


ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి మున్నా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న దాడి మున్నా శనివారం ప్రచారం ముగించారు. నగరంలోని హై రోడ్డు, గాంధీ రోడ్డు, ఎంఎస్ఆర్ కూడలి, దర్గా చౌక్ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు గ్యాస్ సిలిండర్ గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. క్యూలు అన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు భారీగా బారులు తీరి క్యూలలో వేచివుండి స్వామిని దర్శించుకున్నారు.. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా స్వామి దర్శనభాగ్యం కల్పించారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన నరేష్‌కుమార్ రూ.1,00,116 విరాళం అందజేశారు. నగదును శనివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనభాగ్యం కల్పించి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రతి సారీ ఎన్నికల ముందే బాబు ఆర్భాటం

ప్రతి సారీ ఎన్నికల ముందు చంద్రబాబు ఆర్భాటం చేయడం మామూలే. 1999 ఎన్నికల ముందు కోటి ఉద్యోగాలిస్తామని చెప్పారు. 2014లో ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు 3 సెంట్ల స్థలం, డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ అంటూ వరాలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక అవేవీ ఇవ్వలేదు. ఈ సారి సూపర్ సిక్స్ అన్నారు. రూ.4వేలు పింఛన్ అన్నారు. దాన్ని ప్రజలెవరూ పట్టించుకోకపోవడంతో, ఐదేళ్ల క్రితం నాటి ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నారు. జగనేదో భూములు లాక్కునేస్తారని అబద్ధాలు చెప్పి భయపెడుతున్నారు. గెలిచినా, గెలవకపోయినా ఎన్నికలయ్యాక మళ్లీ ఆయన ఇక్కడ కనిపించరు. ఇలా ప్రతి సారీ ఎన్నికల ముందు వచ్చి అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్యపెట్టడం ఆయనకు అలవాటుగా మారింది.

–నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

కరోనా సమయంలో ఏమయ్యారు?

కరోనా సమయంలో రాష్ట్ర ప్రజలు బిక్కుబిక్కుమని బతుకుతుంటే ఈ చంద్రబాబు హైదరాబాద్‌లో దాక్కున్నారు. కనీసం ఆ పార్టీ నాయకులు కూడా రాష్ట్రంలో ఎక్కడా కనిపించలేదు. అంతటి క్లిష్ట సమయంలోనూ జగనన్న ఇంటింటికీ వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా మందులు, నిత్యావసరాలు పంపించారు. వారు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు అండగా నిలిచారు. అప్పుడు కూడా టీడీపీ వాళ్ల ప్రభుత్వం పైన బురదజల్లేందుకు ప్రయత్నించారే కానీ ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాలు, క్వారంటైన్ సెంటర్లు, ఆక్సిజన్ ప్లాంట్లు, పంపిణీ చేసిన వ్యాక్సిన్స్ దేశంలో మరెక్కడా చేయలేదు. పేదల ప్రాణాలు కాపాడుకోవడానికి జగనన్న ప్రభుత్వం చేసిన కృషి ప్రశంసనీయం.

– రెడ్డెప్ప, చిత్తూరు ఎంపీ

బాబు వస్తే గ్రామ సచివాలయాలకు తాళం

చంద్రబాబు మాయమాటలు నమ్మి ఓటేస్తే గ్రామ, వార్డు సచివాలయాలకు తాళమేస్తారు. వలంటీర్లను జైలుకు పంపుతామని బాబు ముందుగానే చెప్పారు. గ్రామ సచివాలయాలన్నీ జన్మభూమి కమిటీల స్థావరాలుగా మారుతాయి. అధికారులు, బ్యాంకర్లను కూడా ఉత్సవవిగ్రహాలుగా మార్చేస్తారు. పింఛను కోసం టీడీపీ నాయకుల ముందు చేతులు కట్టుకుని నిలబడాలి. ఆ ఊర్లో పింఛనుదారుడు మరణిస్తేనే కొత్త పింఛను ఇచ్చే పరిస్థితి వస్తుంది. ఆ పింఛను కోసం గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి వస్తుంది. వ్యవసాయం దండగ అంటూ అన్నదాతలను పక్కన పెట్టేస్తారు. ప్రజలందరూ గుర్తుంచుకోండి.. లంచం ఇవ్వకుండా మళ్లీ పథకాలన్నీ మీ ఇంటికి రావాలంటే, ఫ్యాను గుర్తుకు ఓటేసి, జగనన్న రుణం తీర్చుకోండి.

– విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే!

- చంద్రబాబు అంటే మోసం.. జగన్ అంటే నమ్మకం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- చిత్తూరుకు యూనివర్సిటీ, నవోదయ స్కూల్ తీసుకొస్తాం
- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



ఆపిల్ పండ్ల హారంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సత్కారం, బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఎన్నికల ముగింపు ప్రచార సభను శనివారం చిత్తూరులోని కాణిపాకం బైపాస్ రోడ్డులో భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. దీనికి విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిని ఆ పార్టీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ ఆపిల్ పండ్ల గజమాలను వేసి విజయ చిహ్నంగా డేగ బొమ్మను జ్ఞాపికగా అందజేశారు. మండుటెండలో వేలాది మంది ప్రజలు ఈ సభకు హాజరయ్యారు.

నిమ్నవర్గాలంటే చులకన

చంద్రబాబు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని, అయన్ను నమ్మితే మరోసారి ప్రజలందరినీ నట్టేట ముంచేస్తారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. చంద్రబాబుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్లతోపాటు ఆటో, లారీ, ట్రిప్పర్ డ్రైవర్లు అంటే చులకన అన్నారు. మూడు సార్లు సీఎంగా ఉన్నా జిల్లాకు చేసేందేమీ లేదన్నారు. పవన్ కల్యాణ్(పీకే) ఆవేశంతో డ్యాన్స్ వేయడం తప్ప పీకేదేమీ లేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో సైకిల్ పోవాలి.. జగనన్న రావాలని నినదించారు. అందుకు ఓటర్లు ఆశీర్వదించాలన్నారు. చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోటీశ్వరులు కాబట్టే టికెట్ ఇచ్చారన్నారు. బీసీలను చంద్రబాబు రాజ్యసభకు ఎందుకు పంపలేదని నిలదీశారు. అదే జగనన్న ముగ్గురు బీసీలను రాజ్యసభకు పంపారన్నారు. ఎస్సీ, మైనారిటీలను జగనన్న డిప్యూటీ సీఎంలను చేస్తే బాబు మైనారిటీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదన్నారు. బాబు అంటే మోసం..జగనన్న అంటే నమ్మకమన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 యజమాన్యం తమ సామాజికవర్గ నాయకుడైన చంద్రబాబును సీఎంగా చేయాలని వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతోందన్నారు. ప్రజల కష్టాలతో వారికి అక్కర్లేదని, కేవలం టీడీపీ అధికారంలోకి రావడమే వారికి కావాలని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జగనన్న రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు.

తెలుగుదేశం రౌడీల పార్టీ

కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి అధికారంలో రావాలని పసుపు పార్టీ భావిస్తోందని ఎంపీ రెడ్డెప్ప దుయ్యబట్టారు. వంగవీటి రంగా, మాధవరెడ్డి మరణాల వెనుక బాబు కుట్ర ఉందని ఆరోపించారు. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి రౌడీయిజం చేసి అధికారంలో రావాలని టీడీపీ నాయకులు ప్రణాళిక రచిస్తున్నారని తూర్పార బట్టారు. జిల్లాలో ఎంపీ నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. ఏ పదవిలో లేనప్పుడే చిత్తూరులో విజయానందరెడ్డి కోట్లు పెట్టి సేవ కార్యక్రమాలు చేశారన్నారు. మార్కెట్‌గేటు వదులుకున్నారని, కోవిడ్ బాధితులు, వరదబాధితులకు, ఆటో వారికి సాయం చేశారన్నారు. పేదలకు తోపుడు బండ్లు ఇచ్చారని, మైనారిటీలకు రంజాన్‌తోఫాలు అందజేసి తనవంతుగా సాయం చేశారన్నారు. జగనన్న తనపై నమ్మకంతో మరోమారు పోటీ చేయడానికి అవకాశం కల్పించారన్నారు. అందరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి నన్ను, విజయానందరెడ్డిని దీవించాలన్నారు.


ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

యూనివర్సిటీని తీసుకొస్తాం

ఒక అవకాశం ఇవ్వండి చిత్తూరు అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ప్రజలను అభ్యర్థించారు. జగనన్న స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. చిత్తూరులో యూనివర్సిటీ స్థాపన, నవోదయ పాఠశాల, మంగసముద్రం డంపింగ్‌యార్డు మార్పు, పరిశ్రమల స్థాపన, శాశ్వత తాగునీటి సరఫరాను అందిస్తానన్నారు. చిత్తూరుకు పక్క రాష్ట్రాల నుంచి రోడ్డు కనెక్టివిటీ బాగుందన్నారు. జగనన్న నాయకత్వంలో ఇక్కడ కంటైయినర్ యార్డు, కస్టమ్ ఆఫీస్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే జీఎంసీ భూకబ్జాలు చేసుకొని దోచుకున్నరన్నారు. వారికి ఎంతసేపు వారి స్వార్థం తప్ప ప్రజాసమస్యలు పట్టవన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు జీఎంసీపై భూబకాసురుడు అని రాసిన ఎల్లోమీడియా ఇప్పుడు ఆయన్ను హరిశ్చంద్రుడితో పోలుస్తోందన్నారు. తనపై కక్ష కట్టి ఆంధ్రజ్యోతి ఒక పేజీ వరకు తప్పుడు వార్త రాసిందన్నారు. వారికి తోడుగా ఈనాడు కక్షకట్టి వార్తలు రాస్తోందన్నారు. ఆ పేపర్లను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ అభ్యర్థికి బడుగు, బలహీన వర్గాలంటే చులకన అన్నారు. తన జీవితం తెరిచిన పుస్తకమని, తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. ఓటర్లందరూ విజ్ఞతతో ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, బీసీ నాయకులు రావూరిఈశ్వర్‌రావు, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులు కన్నన్, అప్పాజి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం

నగరంలో డివిజన్ల వారీగా వైఎస్సార్‌సీపీ ప్రచారం శనివారంతో ముగిసింది. పలు ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. మంచి జరగాలంటే జగనన్న రావాలని చెప్పారు. కొంగారెడ్డిపల్లెలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తోటపాళ్యంలో కార్పొరేటర్ గణేష్, నాయకులు శరవణ ప్రచారం చేశారు.






చిత్తూరు: డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి ప్రచారం, గుడిపాల: బొమ్మసముద్రంలో ఐటీ ఉద్యోగులు, తుమ్మలవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం, నంగమంగళంలో ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న నేతలు, 197రామాపురంలో ఎన్నికల ప్రచారం

చిత్తూరు అభ్యర్థుల బలాబలాలు

- రేపే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- చిత్తూరు వాసుల నిర్ణయమే శిరోధార్యం
- ప్రజాసేవనే నమ్ముకున్న విజయానందరెడ్డి
- నాన్‌లోకల్‌గా నేతల్ని నమ్ముకున్న జీజేఎం

చిత్తూరు అర్బన్: సుదీర్ఘ ఎన్నికల ప్రచారం.. 59 రోజుల పాటు సాగిన సార్వత్రిక ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. మరో 24 గంటల్లో తమ తీర్పును వెలువరించడానికి చిత్తూరు ప్రజలు సమాయత్తమవుతున్నారు. అయిదేళ్ల పాటు తమను పాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడానికి ప్రజలు ఓటు రూపంలో తీర్పునివ్వనున్నారు. చిత్తూరు బరిలో 13 మంది ఉన్నప్పటికీ ప్రధాన పోటీమాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంసి.విజయానందరెడ్డి (ఫ్యాన్ గుర్తు), టీడీపీ నుంచి జి.జగన్‌మోహన్ నాయుడు (సైకిల్ గుర్తు) మధ్యేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు అభ్యర్థుల బలాబలాలు ఓసారి పరిశీలిస్తే..

విజయానందరెడ్డి



- వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని నమ్ముకుని తాను చేసిన ప్రజా సేవా కార్యక్రమాలు గెలిపిస్తాయనే విశ్వాసం.
- గత అయిదేళ్లలో మునిసిపల్ కార్పొరేషన్‌కు మార్కెట్ గేటు కోసం తన డబ్బులు రూ.3.68 కోట్లు చెల్లించి వ్యాపారులకు గేటు ఉచితం చేశారు.
- చవటపల్లె, ప్రభుత్వ ఆస్పత్రి, సావిత్రమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంగనపల్లె కూడలి, కైలాసపురం చిత్తూరు మండలంలోని తాళంబేడు, నాయినిచెరువు, గుడిపాల మండలంలోని శ్రీరంగంపల్లె, పానాటూరు, గుడిపాల ప్రాంతాల్లో ప్రజలకు శుద్దినీటి ప్లాంట్లను తన సొంత డబ్బులతో ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు ట్యాంకర్లతో ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నారు.
- రాష్ట్రంలోనే సెమీ కండక్టర్లు తయారుచేసే తొలి ఐటీ కంపెనీని గంగాధర నెల్లూరు మండలం కొత్తపల్లెమిట్ట సమీపంలో ఏర్పాటు చేయడంలో విజయానందరెడ్డి కీలకపాత్ర పోషించారు. స్మార్ట్ డీవీ ఐటీ కంపెనీ ఏర్పాటుకు మూడు ఎకరాల స్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు దశలవారీగా పది వేల మంది యువతకు విద్యావకాశాలు కల్పించనున్నారు. త్వరలోనే ఇది ఉపయోగంలోకి రానుంది.
- గత నాలుగేళ్లల్లో ముస్లింలకు రంజాన్ పండుగవేళ తోఫా పేరిట నెలకు సరిపడే నిత్యావసర సరుకులు. మసీదుకు రూ.50 వేలు చొప్పున నగరంలోని 46 మసీదుల్లో కనీస వసతులు కల్పించారు. శిథిలావస్థలో ఉన్న షాదీఖానాకు రూ.10 లక్షలు వెచ్చించి ఆధునీకరించారు. క్రిస్మస్ పండుగ వేళ క్రైస్తవులకు నూతన వస్త్ర కానుకలు, దీపావళి, ఉగాది పండుగలకు నిత్యావసర వస్తువులు ఉచితంగా అందజేశారు.
- పీఎల్ఆర్–వీఎస్ఆర్ క్రికెట్ టోర్నీలు నిర్వహిస్తూ భారీ నగదు బహుమతులు ఇస్తూ వస్తున్నారు. కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాలకు ఉచితంగా ఫ్యాన్లు, తుఫాను సమయాల్లో బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు.
- రోడ్డుపై వ్యాపారాలు చేసుకునేవాళ్లకు రూ.60 లక్షల విలువైన 80 తోపుడు బళ్లను ఉచితంగా అందచేశారు. పీవీకేఎస్ డిగ్రీ కళాశాలలో ధ్యాన మందిరం నిర్మాణం కోసం రూ.20 లక్షలు తనవంతుగా అందించారు.
- సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని 45 వేల మంది మహిళలకు ఉచితంగా చీరలు ఇవ్వడంతో పాటు ఆశావర్కర్లు, రీసోర్సు పర్సన్లు, రేషన్ డీలర్లు, వలంటీర్లకు ఉచితంగా వస్త్రాలు, వాటిని కుట్టించుకోవడానికి రూ.వెయ్యి చొప్పున నగదు అందచేశారు.
- ఓ డ్రైవర్‌గా తన జీవితాన్ని ప్రారంభించిన గతాన్ని గుర్తుచేసుకుంటూ నియోజకవర్గంలో 3500 మంది ఆటో, మినీ వెహికల్స్, లారీ డ్రైవర్లకు నాలుగు జతల యూనిఫామ్‌తో పాటు వాటిని కుట్టుకోవడానికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున నగదును కూడా అందించారు.
- ఆకలితో అలమటించేవాళ్ల కోసం జగనన్న క్యాంటీన్ ప్రారంభించి రోజుకు 600 మందికి ఉచిత పౌష్టికాహారం ఇప్పటికీ అందిస్తున్నారు.
- చనిపోయివాళ్ల మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు ఉచితంగా రెండు మహాప్రస్థానం వాహనాలు, ఫ్రీజర్లను ప్రజలకు అందుబాటులో ఉంచారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, తాను చేసిన సేవా కార్యక్రమాలే ప్రజలు తనవైపు అండగా నిలుస్తారని విజయానందరెడ్డి స్పష్టం చేశారు.
- తనను గెలిపిస్తే చిత్తూరుకు శాశ్వత నీటి సమస్య పరిష్కారం, ఐటీ హబ్ ఏర్పాటు, ఇన్నర్–అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చొరవ చూపిస్తామన్నారు.

గురజాల జగన్ మోహన్ నాయుడు



- జనం కష్టం తెలియని వ్యక్తి గురజాల జగన్‌మోహన్ నాయుడు(జీజేఎం). ఏనాడూ ప్రజల మధ్య ఉంటూ, వాళ్ల కష్టంలో పాలుపంచుకుంది లేదు.
- తాను పుట్టింది గుడిపాల, చదువుకుంది చిత్తూరు అని చెప్పుకునే జీజేఎం గత 20 ఏళ్లుగా ఎక్కడున్నాడో.? ఏం చేశాడో..? ఎవ్వరికీ తెలియదు.
- సంపన్న శ్రేణి కేటగిరీ, విలాసవంత జీవనానికి అలవాడ్డుపడిన జీజేఎంను సామాన్యులు నేరుగా కలిసే పరిస్థితిలేదు. వాళ్ల సమస్యలు ముందుగా ఇక్కడున్న మధ్యవర్తులకు చెప్పాలి.
- సరిగ్గా ఆర్నెళ్ల క్రితం బెంగళూరు నుంచి ఊడిపడ్డ ఇతను.. చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తా, ఫ్యాక్టరీలు తెప్పిస్తా, స్మార్ట్‌సిటీ చేస్తా, గ్రీన్‌సిటీ చేస్తా అంటూ ఊదరగొట్టడాన్ని ప్రజలు నమ్మడంలేదు.
- సోషల్ మీడియా వేదికగా రీల్స్ చేయడం.. దాని ద్వారా ప్రజలకు దగ్గరవడానికి ప్రయత్నించి నవ్వులపాలయ్యాననే వాస్తవాన్ని గ్రహించడంలేదు.
- మత ప్రాతిపదికన ముస్లింలను ద్వేషం ప్రదర్శించే పార్టీతో జత కట్టడం.. చిత్తూర వాసులకు నచ్చకపోవడంతో ఇతనికి ఆ వర్గం నుంచి 95 శాతం సహాయ నిరాకరణే.
- ఎర్రచందనం స్మగ్లర్లు, హత్యా రాజకీయాలు, రౌడీయిజాలు చేస్తూ చిత్తూరు అభివృద్ధికి అడ్డుగా నిలిచిన నేతలను పక్కన పెట్టుకుని తిరగడంతో.. విద్యావంతులకు ఈయనపై నమ్మకం లేదు.
- ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ తన మకాంను బెంగళూరుకు మార్చేస్తాడనే చర్చ ఉంది.
- ఎస్సీ, ఎస్టీ మహిళలపై ఈయన చేసిన అనుచిత వ్యాఖ్యలతో ఆ వర్గం ఓట్లు పొందడం కష్టమే.
- కొన్ని కులాలను ఇంటిగేటు లోపలకు కూడా రానివ్వరనే అపవాదు ఉంది.

ఓటు వినియోగం– నిబంధనలు



చిత్తూరు కలెక్టరేట్: ప్రజాస్వామ్యంలో ఓటుకు ప్రాధాన్యత ఉంటుంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికి వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49–ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు ఈవీఎంలలో వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్‌చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దొంగ ఓట్లు వేసే అవకాశం ఉండదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అనుమతి వీరికే

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్లకు అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది. మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

వీవీ ప్యాట్‌తో...

ఈవీఎంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు ఉంటాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దాంతో తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఉన్నట్లు లెక్క. లేకుంటే పీఓ (ప్రిసైడింగ్ అధికారి)కి ఫిర్యాదు చేయాలి.

ఓటింగ్ ప్రక్రియ

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీఓ), అదనపు ప్రిసైడింగ్ అధికారి(ఏపీఓ), ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు(ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటరు పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య, పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరైనదేనని నిర్ధారిస్తే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ–1 మూడు 'బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టర్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం) నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ–2 వద్దకు వెళితే ఓటరు స్లిప్ తీసుకుని కంట్రోల్ యూనిట్ (సీయూ) లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఓటరుకు ఏమైనా అనుమానాలు, సందేహాలుంటే పీఓకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటలకు ఒకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరల్ అధికారికి సమాచారం అందిస్తారు.

నిబంధనలు పాటించాలి

ఓటుహక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించకూడదు. సెల్‌ఫోన్‌లను వెంట తీసుకెళ్లేందుకు వీల్లేదు. ఓటరు పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి ఓటరు స్లిప్ ప్రామాణికం కాదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 16 రకాల గుర్తింపుకార్డులలో ఏదైనా ఒకటి తీసుకెళ్లి ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

ఓటు వినియోగంపై ఉద్యోగుల ర్యాలీ


ద్విచక్రవాహన ర్యాలీలో కమిషనర్ అరుణ, ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: భారతదేశ ప్రజాస్వామ్యపు పండుగలో ఓటర్లంతా తరలివచ్చి ఓటు వేయాలని చిత్తూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ చిత్తూరు కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, మే 13న జరిగే ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ పోలింగ్ శాతం నమోదు కావాలని చెప్పారు. గత ఎన్నికల్లో పట్టణ ప్రాంతంలో పోలింగ్ శాతం తక్కువ ఉందని, ఈ ఎన్నికల్లో గరిష్ఠ స్థాయిలో పోలింగ్ శాతం నమోదు అయ్యేలా ఓటర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కమిషనర్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ర్యాలీని ముందుకు నడిపించారు. ఓటు హక్కు ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరిస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నగరపాలక ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు నగరంలో మహావీర్ వంతెన మీదుగా గాంధీ కూడలి, ఎమ్మెస్సార్ సర్కిల్, దర్గా సర్కిల్, గిరింపేట సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డు సచివాలయాల పరిధిలో స్థానిక వార్డు కార్యదర్శులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు